# అంతం

■ తోలేటి జగన్మోహనరావు

చిన్నారి చిలకమ్మ కళ్ళు తెరిచి రెక్కలు ఒక్కసారి తపతపలాడించి, ఆకాశంలోకి లేచి, సముద్రం అంచుదాకా వ్యాపించి ఉదయపు ఎండలో ఆకుపచ్చటి తివాసీలా మెరుస్తున్న అడవి మీద ఎగురుతూ, ఎగురుతూ ఓ మర్రి చెట్టు కొమ్మ మీద వాలింది. మర్రిచెట్టుకు వందగజాల దూరంలో వాగు ఒకటి గలగల పారుతూ సంగీతం పాడుతోంది. ఆ సంగీతం వింటూ, "ఏరా తిమ్మన్నా, బాగున్నావా?" అని తిమ్మణ్ణి పలకరించింది చిన్నారి.

"ఓ..." అన్నాడు సమాధానంగా చిటారు కొమ్మల్లో, కొమ్మమీంచి కొమ్మ మీదకు దూకుతూ కిచకిచలాడుతున్న తిమ్మన్న. తెల్లారి లేచింది మొదలు రాత్రి నిద్రపోయేదాకా వాడికి కాలు ఒక చోట నిలవదు. అంతకుముందు వారం రోజులు ఏకధాటిగా, కుండపోతగా వానకురిసి, ఆ ఉదయమే పూర్తిగా తగ్గింది. ఈ వారం రోజులూ కాళ్ళూ చేతులూ కట్టేసినట్లు పడున్న తిమ్మడికి ఇవ్వాళ మళ్ళీ ఆడుకోడానికి వీలు చిక్కింది. అలా కొమ్మలు పట్టుకు ఊగుతూ ఆడుతున్న వాడి చూపు దిగువ వాగులో వెండి కోడిగుడ్డులా తళతళలాడుతున్న వస్తువు మీద పడింది. నిన్నటిదాకా వాగు పొంగి నిండుగా ప్రవహించింది. వాన తగ్గాక ఇప్పుడు వాగు లోపల పలచగా నీరు ప్రవహిస్తోంది. ఆ నీటిలో మునిగీ మునగకుండా ఉంది ఆ వస్తువు.

తిమ్మన్న కొమ్మల మీంచి ఊగుతూ వెళ్ళి వాగు గట్టు మీదికి దూకి, కిందకు వంగి చూశాడు. 'ఇది ఇక్కడ ఇంతకు ముందు లేదే. ఎక్కడ నుంచి వచ్చిందబ్బా' అని కొంచెం సేపు బుర్ర గోక్కుని ఆలోచించాడు. వందల సంవత్సరాల నుంచి భూగర్భంలో ఉన్న ఆ వస్తువు, వారం రోజులు కురిసిన వానకి పైన కప్పిన మట్టి కొట్టుకుపోయి కొద్దిగా బయటపడింది. వాననీరు దానిమీదుగా గలగల చప్పుడు చేస్తూ దిగువకు ప్రవహిస్తోంది.

వాడు కాసేపు అలా నోరు తెరిచి చూసి, అదేవిటో తెలుసుకోవాలన్న ఆసక్తితో గట్టుమీంచి దానిమీదకు దూకగానే, పెద్ద ధ్వనితో అది పేలింది.

వాడి కోతి చేష్టలు నవ్వుతూ చూస్తున్న చిన్నారి నిర్ఘాంతపోయింది. ఏం జరిగిందో అర్థం కాక అది కీచుకీచుమని అరుస్తూ అటూ ఇటూ గాబరాగా ఎగిరింది. ఆ పేలుడు శబ్దం వినగానే చెట్లమీద పక్షులన్నీ ఒక్కసారి గోలగా ఆకాశంలోకి లేచాయి. మృత్యుభయంతో అడవిలోని జంతువులన్నీ "మనిషి... మనిషి" అని రోదిస్తూ అటూ ఇటూ పరుగులు తియ్యసాగాయి.

ఆ మాట వినడం అదే మొదటిసారి చిన్నారికి.

ఆ మనిషి ఎవరో, అదంటే అంత భయం ఎందుకో దానికి అర్థం కాలేదు. కానీ, ఆ భయం దానిని కూడా ఆవహించింది. రివ్వున బాణంలా ఎగిరి, రావిచెట్టు తొర్రలో గూడు చేరుకుని, ఆత్రంగా తన కోసం ఎదురు చూస్తున్న అమ్మ పక్కన వాలి, "అమ్మా! అమ్మా మనిషంటే ఏవిటి?" అనడిగింది.

ఆ మాట చెవిన పడగానే చిలకతల్లి మొహం పాలిపోయింది. "ష్... ఊరుకో" అంది తన భయాన్ని కప్పిపుచ్చుకుంటూ.

"అమ్మా, మనిషంటే అడవంతా ఎందుకు అలా బెదిరిపోతోంది? అదేం జంతువు? నువ్వెప్పుడైనా చూశావా?" అనడిగింది చిన్నారి.

"నేను చూళ్ళేదు. చెప్పుకుంటుంటే వినడవే తప్ప చూసినవాళ్ళెవరూ లేరు."

"అది కొండంత ఉంటుందా?"

"ఉండదు."

"పోనీ ఏనుగంత ఉంటుందా? పాములా కాటేస్తుందా? పులిలా మెడ కొరికి చంపుతుందా? గద్దలా తన్నుకుపోతుందా? ఎందుకమ్మా జంతువులన్నీ అలా భయపడుతున్నాయి?" అనడిగింది చిన్నారి.

"చూడ్డానికి కోతిలాగే ఉండేదట. కాళ్ళ మీద నిటారుగా నడిచేదట" అంటూ మనిషి గురించి తాను విన్నది చెప్పబోయి, "నీకు అనవసరమైనదేదీ లేదు. పోయి ఆడుకో" అని మందలించి, మాట మార్చి పంపించేసింది తల్లి. అప్పటికి తాత్కాలికంగా చిన్నారి మరచిపోయింది కానీ, వారం రోజుల తర్వాత నది సముద్రంలో కలిసే చోట చిన్నారి 'మనిషి'ని చూసింది. దూరం నుంచి కొమ్మల ఆకులు మాటు చేసుకుని ఆ ఆకారాన్ని పరిశీలనగా చూసింది. తల్లి వర్ణించినట్లుగానే ఉన్న ఆ ఆకారం నది ఒడ్డున ఇసుకలో వెల్లకిలా పడుకునుంది.

చిన్నారి పులుల్నీ, సింహాల్నీ, ఖడ్గమృగాల్నీ, కొండచిలువల్నీ- భయంకరమైన జంతువులెన్నింటినో చూసింది. వాటితో పోల్చి చూస్తే అర్భకుడిలా కనిపించే మనిషంటే అందరికీ అంత బెదురెందుకో దానికి అర్థం కాలేదు. పైగా నవ్వొచ్చింది. కొంచెం ధైర్యం తెచ్చుకొని, ఇంకొంచెం దగ్గరకి గంతులేసుకుంటూ వెళ్ళింది. కొంచెం ముందుకు గెంతి ఆగి, మళ్ళీ గెంతి ఆగి, మెల్లమెల్లగా నాలుగైదు అడుగుల దగ్గరదాకా వెళ్ళి పరిశీలనగా చూసింది. కళ్ళు, ముక్కు, నోరూ, కాళ్ళూ చేతులూ- అంతా తల్లి వర్ణించినట్లుగానే ఉంది. బహుశా నిద్రపోతున్నట్లుంది. ఆ ఆకారం కదలలేదు. చిన్నారి రెండు క్షణాలు మనిషిని పరిశీలనగా చూసి, అమ్మ దగ్గరకు తిరిగొచ్చి, "మనిషిని నేను చూశానమ్మా. నాకేం భయం వెయ్యలేదు" అంది గర్వంగా.

చిలకతల్లి పెద్దగా నవ్వి, "మనిషి ఇప్పుడెక్కడున్నాడు. నువ్వు నిద్రపోయి కలగనుంటావు" అంది.

"నిజం అమ్మా. రా చూపిస్తా. ఆ నది ఒడ్డున పడుకునున్నాడు" అని అమ్మని తీసుకెళ్ళి చూపించింది.

చిలకతల్లి ఆ ఆకారాన్ని చూసి, "ఇది మనిషి కాదు, దేవుడి విగ్రహం. వరదల్లో కొట్టుకువచ్చి ఉంటుంది" అంది.

"దేవుడంటే?"

చిత్రాలు: నర్సిం





"మనిషి తనలాంటి రూపాన్ని ఊహించి దాన్ని దేవుడనేవాడు. ఈ ఆకాశం, నక్షత్రాలూ, సూర్య చంద్రులూ, చెట్టూ చేమా- అన్నీ ఆ దేవుడే సృష్టించాడని వాడు నమ్మేవాడు."

ఈ బ్రహ్మాండంలో, కోటానుకోట్ల నక్షత్రాలలో, ఒక నక్షత్రాన్ని ఆశ్రయించిన ఒక గ్రహం మీద ప్రాణం పోసుకున్న కోట్లాది జీవుల్లో ఒక జీవి ఒక రూపాన్ని దేవుడనడం, అదే ఈ బ్రహ్మాండాన్ని నడిపిస్తుందనడం చిన్నారికి అర్థం కాలేదు.

"నిన్నూ, నన్నూ కూడా ఈ దేవుడే సృష్టించాడా. నాకు అర్థం కావడం లేదు" అంది చిన్నారి.

"మహా మహా తత్త్వవేత్తలకే చివరి వరకూ అర్థం కాలేదు. నీకేం అర్థం అవుతుంది" అంది చిలకతల్లి.

ఈ మనిషి చాలా వింతగా ఉన్నాడే అనుకుంది చిన్నారి. దానికి మనిషి పట్ల ఆసక్తి పెరగసాగింది.


మరి కొన్నాళ్ళకు మరో దృశ్యం దాని కంటపడింది. అంతవరకు దూరాన్నుంచి చూసి అది కొండ అనుకుంటోంది. ఆ రోజు దగ్గరకు వెళ్ళినప్పుడు అది కొండ కాదని దానికి అర్థమైంది. దట్టమైన అడవి దాన్ని మింగేసినా, చిటారు కొమ్మల్ని దాటి నిట్టనిలువుగా ఆకాశంలోకి లేచిన ఆ కట్టడం దగ్గర నుంచి స్పష్టంగానే కనిపిస్తోంది. లోపల అంతా మట్టిమట్టిగా, చీకటిగా, తడిగా, నాచుతో, పిచ్చిమొక్కలతో, తీగలతో నిండి ఉంది. అందులో గబ్బిలాలు కీచుకీచుమంటూ ఎగురుతున్నాయి. లోపలి గూళ్ళలో ఎగురుతూ ఆశ్చర్యంగా చూసింది చిన్నారి.

ఎంత అర్భకుడు? ఎలాంటి శక్తులు సంపాదించాడు." చిలకతల్లి చెప్పసాగింది. "తన చేతుల్తో స్వయంగా చిన్న రాయి కూడా ఎత్తలేకపోయేవాడు. కానీ, కొండల్ని కదిలించేవాడు. నాలుగడుగులేస్తే అలసిపోయే సుకుమారజీవి, ప్రపంచవంతా తిరిగేవాడు. వాడు ఆకాశంలోకి దూసుకుపోయి చంద్రుణ్ణి కూడా అందుకున్నాడు."

"ఇదేంటి అమ్మా?" అమ్మని తీసుకొచ్చి చూపించి అడిగింది చిన్నారి.

చిలకతల్లి నిట్టూర్చింది.

"ఇలాంటి ఆకాశాన్నంటే భవనాల్లోనే మనిషి ఉండేవాడు..." చిలకతల్లి తరతరాలుగా అనుశ్రుతంగా వస్తున్న మనిషి కథ చెప్పసాగింది.



"...ఒకప్పుడు ఈ భవనం దీపకాంతులతో రాత్రి కూడా పట్టపగలులాగానే ఉండేది. ఇలాంటి వందలూ, వేల భవనాలతో ఇదంతా పెద్ద నగరంలా ఉండేదిట..."

చిన్నారికి తల్లి చెప్పేది నమ్మశక్యంగా లేదు. ఈ కీకారణ్యం ఒకప్పుడు లక్షలమంది నివసించే మహానగరమనీ, ఇందులో అంతరిక్షాన్నంటే హర్మ్యాలుండేవనీ, దారీ తెన్నూ లేని ఈ అడవిలో ఒకప్పుడు రైళ్ళు శరవేగంతో పరిగెత్తేవనీ, రోడ్లమీద వింతవింత వాహనాలలో మనుషులు ప్రయాణం చేసేవారనీ, ఇప్పుడు అడుగు పెట్టడానికి శక్యంగాని ముళ్ళ డొంకలదారుల్లో ఒకప్పుడు స్కూలుకి పోయే పసిపాపలు నడిచేవారనీ, ఈ సముద్రాల్ని కలుపుతూ నీటిమీద బ్రహ్మాండమైన ఓడలూ, ఆకాశంలో విమానాలూ తిరిగేవనీ తల్లి చెబుతున్నది దానికి నమ్మడం కష్టంగా ఉంది.

"ఎంత అర్భకుడు? ఎలాంటి శక్తులు సంపాదించాడు." చిలకతల్లి చెప్పసాగింది. "తన చేతుల్తో స్వయంగా చిన్న రాయి కూడా ఎత్తలేకపోయేవాడు. కానీ, కొండల్ని కదిలించేవాడు. నాలుగడుగులేస్తే అలసిపోయే సుకుమారజీవి, ప్రపంచవంతా తిరిగేవాడు. వాడు ఆకాశంలోకి దూసుకుపోయి చంద్రుణ్ణి కూడా అందుకున్నాడు."

"మనిషి ఇంత శక్తి ఎలా సంపాదించాడు?" చిన్నారి ఆశ్చర్యంగా అడిగింది.


"వాడు వెనుక కాళ్ళమీద నిటారుగా నిలబడి ముందుకాళ్ళు, చేతులు చాచగానే ప్రపంచం వాడి చేతుల్లో వాలింది. వాడి చేతులు ఎంత అపూర్వమైనవి? ఎన్ని అద్భుతాలు సృష్టించాయి? వాడికి వరమో, శాపమో- చేతులతో పాటు ఆలోచన, వివేచన అనే శక్తి వచ్చింది. 'నేనెవర్ని? ఎక్కడ నుంచి వచ్చాను? ఎక్కడికి పోతున్నాను? ఈ పువ్వులు ఎందుకు వికసిస్తున్నాయి? ఈ పక్షులు ఎలా ఎగురుతున్నాయి? ఈ చేపలు ఎలా ఈదుతున్నాయి? ఈ ఆకాశం, నక్షత్రాలు ఏవిటి? ఈ సృష్టి ఏవిటి?' అని నిరంతరం ఆలోచిస్తూ, అశాంతిగా అడవుల్లో, కొండల్లో, సముద్రాల్లో, అంతరిక్షంలో అన్వేషిస్తుండేవాడు. ఆ ప్రశ్నలకు సమాధానాలు వెతకడంలోనే అమోఘ శక్తుల్ని సంపాదించాడు. ఆ శక్తుల్ని అదుపులో పెట్టలేకపోయాడు. చివరకు అవే వాణ్ణి నాశనం చేసేశాయి..."

"మనిషి అంత మూర్ఖంగా ఉండేవాడా?"

"వాడెలాంటివాడో చెప్పడం కష్టం. వాడు చాలా దయాళువు. చీమలకి కూడా హాని చెయ్యకూడదనేవాడు. ఒక్కోసారి తనవారినే కోట్లమందిని నిర్దాక్షిణ్యంగా ఊచకోత కోసేసేవాడు. వాడు విశాల హృదయం కలవాడు. వసుధైక కుటుంబం అనేవాడు. కానీ నేను, నాది అంటూ నిరంతరం పోట్లాడుతుండేవాడు. వాడిలో రాక్షసుడికీ, మానవుడికీ నిరంతరం జరిగే పోరాటంలో చివరకు రాక్షసుడే గెలిచాడు. ఆఖరి యుద్ధంలో..."

అణ్వస్త్రాల పరుపు మీద నిశ్చింతగా నిద్రపోతున్న మానవ జాతి ఆ ఆఖరి యుద్ధంలో ఎంత భయానకంగా అంతమైందో చిలకతల్లి ఊహకి కూడా అందలేదు.

నగరాలు అంటుకున్నాయి. పల్లెలు అంటుకున్నాయి. పొలాలు అంటుకున్నాయి. అడవులు, కొండలు, కోనలు అన్నీ అంటుకుని ప్రపంచం అగ్నిగుండమైంది. ఆ అగ్నిగుండంలో శలభాల్లా జనం మాడిపోయారు. తొలి



క్షణాలలోనే వందల నగరాలు నామరూపాలు లేకుండా మాయమైపోయాయి. కోట్లమంది నిద్రపోతున్నవాళ్ళు నిద్రలోనే ఆవిరైపోయారు.

సముద్రాల్లో తాటి చెట్టంత ఎత్తు ఉప్పెన కెరటాలు లేచి జలప్రళయం సృష్టించాయి. అణు ధూళిమేఘాలు చేతులు చాచి తరుముతుంటే, నలువైపుల నుంచీ మృత్యువు కమ్ముకు వస్తుంటే జనం భయవిహ్వాలులై జుట్టు పీక్కుంటూ, పిచ్చివాళ్ళలా మృత్యువు చేతుల నుంచి తప్పించుకోవడానికి మృత్యువు నోట్లోకి పరిగెట్టారు. ఆకాశమంతా ధూళిమేఘాలు అలముకుని పగలు చీకటిగా మారిపోయింది. నెలల తరబడి సూర్యకిరణం నేల తాకలేదు. భూమిమీద ఉన్న చెట్టూచేమా, ఈ దీర్ఘరాత్రిలో, చలిలో నశించిపోయాయి. కలరా, ప్లేగు, మశూచి వంటి వ్యాధులు క్రిమి బాంబుల రూపంలో బద్ధలై, ఇన్నాళ్ళూ బంధించబడ్డ మహమ్మారులు విజృంభించి జనాన్ని కబళించడం మొదలుపెట్టాయి.

నేల విషం, నీరు విషం, గాలి విషం, కన్నతల్లి రొమ్ము విషమై బిడ్డలు అల్లల్లాడిపోయారు. తిండి లేక, మందు లేక, ఉండడానికి వసతి లేక, రోగాలు వెంటాడుతుంటే, అక్కడక్కడా మిగిలిన మనుషులు రాలిపోయారు.

"ఈ ఒక్కసారికి నన్ను కాపాడు తండ్రీ. మళ్ళీ అధర్మంగా ప్రవర్తిస్తే నాశనం చేసేయి. ఒకే ఒక్క అవకాశం ఇయ్యి ప్రభూ" అని గొల్లుగొల్లున ఏడుస్తూ దేవుణ్ణి వేడుకున్నారు జనం. ఉన్నాడు, ఉన్నాడనేవాడు నిజంగా లేకపోయి ఉండొచ్చు. ఒకవేళ ఉంటే, "మీరు నా కరుణకు అర్హులు కారు. నశించిపోండి" అని మానవజాతిని అంతం చేసి ఉండవచ్చు. శాపగ్రస్తమైనట్లు మానవజాతి సమూలంగా అంతరించిపోయింది.

అయితే...

మృత్యువు ఎంత శక్తివంతమైనదో ప్రాణం కూడా అంత శక్తివంతమైనదే. గతంలో ఎన్నో ప్రకృతి ఉత్పాతాలను తట్టుకుని జీవం నిలిచింది. అలాగే ఈ విపత్తునూ తట్టుకుని నిలబడింది. సముద్ర జలాల్లో, భూగర్భాలలో, ఇంకా నశించిపోని మారుమూల భూ ప్రాంతాలలో తలదాచుకున్న జీవజాలం క్రమక్రమంగా విస్తరించింది. కొన్ని వందల ఏళ్ళకు భూమి ప్రాణం పోసుకుని మళ్ళీ పచ్చగా కళకళలాడింది.

"...ఎలాంటి వాడు ఎలా అంతమయ్యాడు మనిషి! వాడు నశించిపోయి వందల ఏళ్ళయినా వాడి దుష్టశక్తులు తమ ప్రభావాన్ని ఇంకా చూపిస్తూనే ఉన్నాయి" అంది చిలకతల్లి నిట్టూరుస్తూ.

మనిషి అంతమైన తీరు తల్చుకుంటే చిన్నారికి జాలి కలిగింది, ఏడుపొచ్చింది. వాడి క్రౌర్యాన్ని ఊహిస్తే భయం వేసింది. మనిషంటే ఏవగింపు కలిగింది. తనకే అర్థంకాని రకరకాల ఆలోచనలు కలవరపెడుతుంటే చిన్నారి తల్లి ఒడిలో కలత నిద్రలోకి జారిపోయింది మెల్లిమెల్లిగా...

**నగరాలు అంటుకున్నాయి. పల్లెలు అంటుకున్నాయి. అడవులు, కొండలు, కోనలు అన్నీ అంటుకుని ప్రపంచం అగ్నిగుండమైంది. ఆ అగ్నిగుండంలో శలభాల్లా జనం మాడిపోయారు.**

## 2

రాత్రి ఆకాశంలో పౌర్ణమి చంద్రుడు తెల్లగా వెలుగుతున్నాడు. నక్షత్రాలు అక్కడక్కడ మెరుస్తున్నాయి. సముద్రంలో అలలు లేచి విసురుగా తీరం దాకా వచ్చి విరిగి వెనక్కు మళ్ళుతున్నాయి. నదిలో అప్పుడప్పుడు నీటిలోంచి పైకెగిరి పడుతున్న చేపలు వెన్నెల్లో వెండి ముక్కల్లా తళుక్కుమంటున్నాయి. పిండారబోసినట్లున్న వెన్నెల అడవి మీద కురిసి, కొమ్మల్లోంచి జారి, కింద ఎండుటాకుల మీద పొడలు పొడలుగా పడుతోంది. కీచురాళ్ళు కీ కీ అని విడవకుండా అరుస్తున్నాయి. ఉన్నట్టుండి 'అడవి జంతువుల గర్జనలు, పక్షుల అరుపులు వినిపిస్తున్నాయి.

ఈ భూమి, సముద్రం, జలవనచరాలు వందల కోట్ల సంవత్సరాలుగా ఇలా ఉంటూనే ఉన్నాయి. మరి వందల కోట్ల సంవత్సరాలు- భూమి మీద సృష్టి అంతమయ్యేవరకూ- ఇలా ఉంటూనే ఉంటాయి. సుదీర్ఘమైన ఈ భూమి చరిత్రలో లక్షల జీవజాతులు పుట్టి, వృద్ధిపొంది నశించిపోయాయి. అతి స్వల్పకాలం, ఓ మెరుపులా మెరిసి వెలిగిన మనిషి కూడా అలాగే నశించిపోయాడు.

అయితే, మిగిలిన జీవజాతుల్లా మానవజాతి మారుతున్న శీతోష్ణ పరిస్థితులలో, పరిసరాలలో ఇమడలేక నశించిపోలేదు. జీవించడంలో తన ప్రత్యేకత చూపించినట్లే, మరణంలో కూడా అది తన ప్రత్యేకతను నిలుపుకుంది.

తాను స్వయంగా తన చితిని పేర్చుకుని ఆ మంటల్లో దూకి అంతరించిపోయింది. ■